క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండలంలో గురువారం పర్యటిస్తారని ఎంపీడీఓ రాధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి ఆయన పర్యటించనున్నారని, వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



సీఐకి విరాళం అందజేస్తున్న మహేశ్

కడ్తాల్: సమాజ సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని సీఐ గంగాధర్ అన్నారు. ఇందులో భాగంగా నేర నియంత్రణకు ఉపయోగపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. బుధవారం మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు.. స్థానిక యువ నాయకుడు జనిగెల మహేశ్ రూ.50 వేలను విరాళంగా సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

మైసిగండి మైసమ్మకు నేతల పూజలు



అమ్మవారి సన్నిధిలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ ఆలయాన్ని బుధవారం స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా.. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగులు నాయక్, సుభాష్, సుమన్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, మణికంఠ తదితరులు ఉన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ పట్టా



జంగయ్య

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కర్రోని జంగయ్యకు ఓయూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. డా.మృదుల లక్కరాజు ఆధ్వర్యంలో జంగయ్య 'దయాస్పోరా అండ్ నాస్టల్జియ ఇన్ ద సెలెక్టెడ్ నావెల్స్ ఆఫ్ బుచియమచేటా అండ్ చిమమాండ నోజంజీ అదిచే' అనే అంశంపై పరిశోధన చేశారు. అనంతరం గ్రంథాన్ని ఉస్మానియా యూనివర్సిటీకి సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ఇస్రో చైర్మన్ డా.వి.నారాయణ్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ కుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జంగయ్య ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

నూతన కమిటీ నియామకం



నూతన కమిటీని సన్మానించిన సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మధు, వైస్ చైర్మన్‌గా నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, కోశాధికారిగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా శ్రీను, సలహా కమిటీ సభ్యులుగా యాదయ్య, వెంకటయ్య, నర్సింహ, చలిచీమల నర్సింహ, సాయిలు, సభ్యులుగా లక్ష్మయ్య, కిరణ్, గోపాల్, భిక్షపతి, మల్లేశ్, జంగయ్య, చెన్నయ్య, శ్రీను, యాదయ్య, పురుషోత్తం, పాపయ్య, రాములు, కేశవులను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు ఘనంగా సన్మానించారు.

దోమల నివారణకు చర్యలు

తుర్కయంజాల్: మలేరియా, డెంగీ దోమల ద్వారానే వ్యాపిస్తుందని, వాటి నివారణకు ముందు జాగ్రత్తనే మేలని కొహెడ పల్లె దవాఖాన డాక్టర్ అజిత్ కుమార్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దోమల వలన కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు విజృంభించకుండా ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

తెగులు.. ముప్పు

ముందు జాగ్రత్తే మేలు
- నివారణ చర్యలు తప్పనిసరి
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- మండల వ్యవసాయ అధికారి శ్రీలత



మంచాల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట చేలకు తెగులు సోకే ప్రమాదం ఉంది. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం మంచాల మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 14వేల 200 ఎకరాలు. అందులో వరి 6వేల 700, పత్తి 3 వేలు, జొన్న 2 వేలు, ఉద్యాన పంటలు 2 వేల 200 ఎకరాల్లో సాగు అవుతోంది. కాగా అధిక వర్షాలు, దాంతో పాటు వాతావరణంలో వస్తున్న మార్పుల వలన పంటలకు తెగులు ముప్పు పొంచి ఉంది. ప్రధానంగా వరి చేనులో నీరు నిల్వ ఉండ కుండా చూడాలి. వర్షాలకు తెగులు రావడంతో పాటు బ్యాక్టీరియ, తెల్లదోమ వలన పంట నష్టపోకుండా చూసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీలత స్పష్టం చేస్తున్నారు. మరిన్ని సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

వరి పంటకు..

ప్రస్తుత వానలతో వరికి ఉల్లికోడు తెగులతో పాటు బ్యాక్టీరియా సోకనుంది. తొలుత ఉల్లికోడు సోకి కుళ్లిన అనంతరం వరి ఎండి పోనుంది. ఆకు ఎండు తెగులు బ్యాక్టీరియ కారణంగా వస్తుంది. దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అన్నదాతలు పంట నష్టపోవాల్సి వస్తుంది.

నివారణ

ఉల్లికోడు తెగులు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 1.5 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. అదే విధంగా వరి పిలకలు రావడం కోసం పట్టారా గుళికలను ఒక ఎకరాకు 6 నుంచి 8 కిలోల చొప్పున యూరియాలో కలిపి చల్లాలి. అదే విధంగా ఆకు ఎండు తెగులు నివారణకు హెక్సాకోనజోల్ మందును 0.6 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



పత్తికి..

పత్తి పంటకు గులాబీ రంగు కాయ తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు సోకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పత్తి ఆకులు ఎర్ర బారుతున్నాయి. వర్షాలతో పెను బంక తెగుళ్లు సోకుతోంది.

నివారణ

గులాబీ రంగు కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరీ పాస్ లేదా ఫినోలో పాస్ క్రిమి సంహారక మందులను 0.1 ఎంఎల్ ఒక లీటరు నీటి చొప్పున పిచికారీ చేయాలి. ఆకు ముడత, తెల్ల దోమ నివారణకు ప్రొపినోపాస్, ట్రైయోజోపాస్ 250 ఎంఎల్ ఒక ఎకర పొలానికి పిచికారీ చేయాలి. పెనుబంక తెగులు నివారణకు డైమేతో ఎట్ లేదా మెతేల్ డెమేటన్ 250 ఎంఎల్ మందును ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. ఉద్యాన పంటలకు తామర పురుగు నివారణకు ప్రథమ దశలోనే చర్యలు తీసుకోవాలి. వేప నూనె 2 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అధ్యాపకుడికి జాతీయ పురస్కారం

ఇబ్రహీంపట్నం: స్థానిక డిగ్రీ కళాశాలలో కామర్స్ అసోసియెట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శంకర్‌కు సామాజిక సేవా విభాగంలో జాతీయ సమైక్యత పురస్కారం దక్కింది. తెలంగాణ సిటీజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని రాష్ట్ర సారస్వత పరిషత్తులో నిర్వహించిన అంతర్జాతీయ యువజన ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం శంకర్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌కు కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సురేష్, అధ్యాపకులు డివిరావు, శ్రీకృష్ణ, హృదయరాజు, వీరారెడ్డి, కృష్ణ, నరేందర్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు. సామాజిక రంగంలో కృషిచేసిన శంకర్‌కు పురస్కారం లభించడం ఎంతో గర్వకారణమన్నారు.



పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ శంకర్

ఘనంగా పోచమ్మ బోనాల పండుగ



బోనాల ఊరేగింపు

ఆమనగల్లు: పూసల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనంతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతీ, యువకుల కేరింతలు, డప్పు వాయిద్యాల చప్పుళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యుడు సత్యం, సంఘం గౌరవ అధ్యక్షుడు నర్సింహ, అధ్యక్షుడు వెంకటేశం, సభ్యులు పరమేశ్, భాస్కర్, మోహన్, అశోక్, రాములు, విజయ్, బాలయ్య, మహేశ్, సాయి, గణేశ్, సైదులు, ఉషారాణి, వసంత, జంగమ్మ, పుష్పలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్

బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందని, పంటలకు యూరియా అందించకుండా వారి ప్రాణాలను బలిగొంటుందని బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు కన్నయ్యగారి బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ రైతులను ఎప్పుడు పట్టించుకోలేదని ఆరోపించారు. గత నెలలో వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను కనీసం పరామర్శించలేకపోయారన్నారు. కాంగ్రెస్ నాయకులు గోదాముల్లో యూరియాను నిల్వచేసుకొని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సమయానికి రైతుబీమా, యూరియా అందిస్తుందన్నారు. రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. వారి వెంట నాయకులు మాసన్నగారి వెంకట్‌రెడ్డి, సురసాని భూమిరెడ్డి, చిలుకల రఘునందన్, కళ్లెం సుధాకర్‌రెడ్డి, సామల దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

షాద్‌నగర్: వర్షాకాలం దృష్ట్యా విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ 20వ వార్డులో డెంగీ సోకిన బాలుడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో నీరు నిల్వ ఉండే కొబ్బరి చిప్పలు, పాత టైర్లను పడేయాలన్నారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ తరఫున దోమలు వృద్ధి చెందకుండా టిమోపాస్ మందును పిచికారీ చేయడంతో పాటు ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామన్నారు. పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.



గంగ్యనగర్ తండా రోడ్డుపై నిరసన తెలుపుతున్న కమలనాథులు

వరినాట్లు వేసి.. నిరసన తెలిపి

తండాల రోడ్ల మరమ్మతులకు డిమాండ్

మాడ్గుల: గిరిజన తండాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, వర్షపు నీరు నిలిచి కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొందని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం మండల పరిధి గంగ్యనగర్ తండా, చెట్టగుట్ట తండా, ఆర్కపల్లి, చౌటకుంటా తండా రోడ్ల దుస్థితిపై ఆందోళన నిర్వహించారు. గంగ్యనగర్ తండా మార్గంలో నిలిచిన బురదలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. రహదారుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రవాణామార్గం మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు మదాసు వెంకటయ్య, హరీశ్‌రెడ్డి, దామర్ల అశోక్, రాజిరెడ్డి, శ్రీశైలం, శంకర్, బద్రి పాల్గొన్నారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు



ర్యాలీలో పాల్గొన్న దశరథ తదితరులు

కడ్తాల్: సేవతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా దశరథ్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ప్రజాప్రతినిధులు లోకేశ్, రామకృష్ణ, లాయక్ అలీ, బీచ్యానాయక్, నాయకులు రాములు నాయక్, సురేశ్ హాజరయ్యారు.

ఉత్సవాలకు విరాళం

ఆమనగల్లు: మండల పరిధి మంగళపల్లి గ్రామంలో మైసమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలకు ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి రూ.15 వేలను విరాళంగా కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. నాయకులు కృష్ణయ్యగౌడ్, తానయ్య, జైపాల్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లయ్య ఉన్నారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి న్యూమధురాపురి కాలనీలో బంగారు మైసమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మేయర్ పారిజాత అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్ఆర్ఓను తరలించవద్దు

- ప్రజలకు పాలన దూరం చేయొద్దు
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: సమీకృత భవనాల నిర్మాణం పేరిట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించి, ప్రజలకు పాలన దూరం చేయవద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇబ్రహీంపట్నంలో రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణానికి నిధులు కేటాయించి, కొంతమేర పూర్తి చేయించానని తెలిపారు. ఆ భవనాన్ని పూర్తిచేయకుండా, మరో ప్రాంతానికి తరలించడమేమిటని ప్రశ్నించారు. పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దీని గురించి స్పందించడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.



కేటీఆర్‌ను కలిసిన గులాబీ నేతలు



కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నగరంలోని ఆయన నివాసంలో బుధవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన పుట్టిన రోజు పురస్కరించుకొని.. దశరథ్‌నాయక్, కేటీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. నాయకులు మల్లేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కళాశాల భవనం వినియోగంలోకి తేవాలి



రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 24 ఏళ్లు గడిచిందని, కానీ ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. అరకొర వసతులతో బాలుర ఉన్నత పాఠశాలలో కళాశాల కొనసాగుతుందని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కళాశాలకు భవన నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలేశారని, నిర్మాణ పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, శివ, వంశీ, కుర్మిద్ద శివ తదితరులు పాల్గొన్నారు.

మండప ఏర్పాట్లకు అనుమతి తప్పనిసరి

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి: సీఐ గంగాధర్



ఉత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న అధికారులు

కడ్తాల్: చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాల ఏర్పాటు, ఊరేగింపుల అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చవితిని పురస్కరించుకుని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీజే అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు, వాహనం, సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇచ్చి, విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, రాత్రి సమయంలో ఒకరు మండపం వద్ద ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, హెడ్ కానిస్టేబుళ్లు దశరథ్, రాములు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అక్షరాస్యత శాతం పెంచాలి

మండల విద్యాధికారి రాందాస్

మంచాల: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని ఎంఈఓ రాందాస్ అన్నారు. బుధవారం మంచాల గ్రామంలో నిర్వహించిన నవ భారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత పెంచాలని సూచించారు. అందుకు పది మంది నిరక్ష్యరాస్యులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వారు వారికి అక్షరాభాస్యం చేయించడమే కాకుండా, చదువు నేర్పించాలని చెప్పారు. సరళ పదాలు రాయడం, చదవడం నేర్పించాలన్నారు. మహిళా సంఘాల సహకారంతో నవ భారత్ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు, వీఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

- కాంగ్రెస్ నాయకులు
- ఘనంగా మాజీ ప్రధాని జయంతి



కడ్తాల్: రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు/ కడ్తాల్: ప్రధాని మంత్రిగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. దివంగత నేత, మాజీ ప్రధాని రాజీవ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కడ్తాల్ మండల కేంద్రం ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు రాజేశ్, రవి, శంకర్, శ్రీశైలం, లింగం, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం యాచారంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గుర్తింపు తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు అక్బర్, సుధాకర్, భాస్కర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

దివంగత నేత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ కేశవులు, నాయకులు ఖలీల్, ఖాదర్, అలీం, మల్లయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధికి కృషి

మంచాల: దేశంలో టెక్నాలజీ, ఐటీ రంగాల అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజీవ్ జయంతి సందర్భంగా బుధవారం మండల పరిధి నోముల, ఆరుట్ల గ్రామంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్, సురేష్, చంద్రయ్య, ముత్తమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్ తదితరులు ఉన్నారు.



యాచారం: రాజీవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆమనగల్లులో..



మంచాల: నోములలో..